# ఈ దేశంలో ఇదో వర్గం!!

## - సావిత్రి

**"నీ** యిష్టం వొచ్చినట్లు తగలెయ్యడానికి నీ బాబు సొమ్మేం లేదిక్కడ!'' (నాకు బాబుంటే సొమ్ము వుంది, ఉన్నది నీ మావ! అందుకే అల్లుడి ప్రమోషన్ కోసం రికమెండ్ చేస్తున్నాడు. నా బాబయితే నన్నే చదివించును)

''రెక్కలు ముక్కలు చేసుకునే వాడికి తెలుస్తుంది- డబ్బువిలువ! తినికూర్చునే దానికేం తెలుస్తుంది?'' (అవునవును! ఎనిమిది గంటలు పనిచేస్తానని చెప్పి ఆరు గంటలు హస్కు కొట్టేవాడికి తెలుస్తుంది గానీ ఇరవై నాలుగ్గంటలూ వెట్టిచాకిరీ చేసే దానికేం తెలుస్తుంది? ఏనాడైనా పది రూపాయలు కంటితో చూస్తేనా?)

''ధర్మాత్మురాలు బయల్దేరింది! ఎవత్తో అడిగిందట! పస్తులుంటున్నానన్నదట! ఈవిడగారు దానం చేసింది! నేనూ ఇస్తున్నాను- ఇలా తాడూ, బొంగరంలేని వాళ్ళకా? అయినా మధ్యన నీ పెత్తనమేమిటి? ఏదో శాస్త్రం చెప్పినట్లు...'' (ఏం? అక్కడాపేశావ్? ఆ శాస్త్రమేదో చెప్పేయ్! తేలు కుట్టినదొంగలా అయిపోయావేం? అత్తసొమ్మునైనానన్ను అందరికీ చాకిరీ చేయమని- నువ్వు పలుకుబడి పెంచుకుంటున్నావు గదూ. పైకెలా చెప్తావ్- ఆ సామెత? అయినా తాళ్ళూ, బొంగరాలూ వున్నవాళ్లు నా దగ్గరికెందుకొస్తారు? తాకట్టు పెట్టుకొనే ధర్మాత్ముడి దగ్గరికొస్తారు గానీ!)

''ఇంకో పది రూపాయలిప్పిస్తానందట! అనదూ! తెచ్చిపెట్టేవాడుంటే- అనదూ? ''ఛీ! డబ్బు విలువ తెలియని ఆడదాన్ని నిన్నే చూసేను!'' (ఆహా! మిగతా ఆడవాళ్ళ గొప్పతనమైనా గుర్తించావు! తరించావు! ఇంతకీ ఇపుడా పదీ ఇవ్వకపోతే నా పరువు పోతుందనేగా? ఇప్పుడేమిటి? నిన్ను కట్టుకున్న నాడే పరువూ, ప్రతిష్టా, తెలివి, తేటా గంగలో కలిసాయి! కొత్తగా పోయేదేమిటి?)

''ఇదిగో! ఇప్పుడే చెప్తున్నా! ఇంకోసారి ఇలాంటి వెధవ్వేషాలేస్తే ఊరుకోను. నా డబ్బంతా తగలేస్తే నిన్నుజ్జోగం వెగలబెట్టమంటానను కుంటున్నావేమో! నా దగ్గర సాగ నీ నాటకాలు'' (ఉహూ! చాలా తెలివి తేటలొచ్చాయే! నీలాంటి వాళ్ళు ఉద్యోగాలు చేయనిస్తారా? అందుకు చాలా సంస్కారం వుండాలి!)

''ఒళ్లు దగ్గరుంచుకుని బ్రతకటం నేర్చుకో!'' వంటింటికేసి రెండడుగులు వేసి,

గట్టిగా బయటికి నడిచాడు చక్రవర్తి!

వీధి తలుపులు వేసేందుకెళ్లిన రాజ్యం కిటికీలోంచి కనబడే దృశ్యానికి రాజుకుపోయింది. 'గడప దాటేటప్పటికి ఎలా వెలుగులు పుట్టుకొస్తాయో ముఖంలోకి? ఎవడ్నో విష్‌చేసి నవ్వుతూ పల్కరిస్తున్నాడు. 'కొంపలోనే వస్తుంది రోగం ! ఛీ! ఛీ' అనుకుంది మంటగా!

''వెధవది మూడు రోజుల నుంచి పస్తులు పడుకున్న వాళ్ళకి ముష్టి రెండు రూపాయలిస్తే- ఇంతగొడవ! ఈ ఇంటిలో చేసే పనికిమాలిన ఖర్చుతో పోల్చితే ఇదో లెఖ్ఖా. ఒకేచోట పెట్టుకోవాలని బోల్డు డబ్బూ, టైమూ తగలేసుకుని ఒక చోట చేరతారు.

పోయిన మనిషికి ఇష్టమైనవన్నీ చేయించుకొని బ్రతికున్నవాళ్ళు పొట్టలు పగిలేట్టు తింటారు. మధ్యాహ్నం పేకాట! రాత్రికి సినిమా! దానికో వంద ఆరిపోతోంది. వర్ధంతి మహోత్సవం మహోత్సాహంగా- పిసరంత దిగుల్లేకుండా చేసేసుకుంటారు. ఆ మాత్రం దానికి చచ్చిన రోజుకి బదులు మరో రోజుకి గుర్తుగా చేసుకోకూడదు? తల్చుకోవడానికీ, చూడటానికీ అసహ్యంగా వుండదు కదా? హు! అంతమాత్రం ఆలోచన వున్నవాళ్ళయితే ఇహ అనుకోడానికేముంది?'' తల నొక్కుకుంది రాజ్యం.

ఐదో తోడికోడలు మేనరికం పిల్ల. బావలందరూ నెత్తిన పెట్టుకుంటారు. చిన్నప్పుడే నాన్న పోతే అమ్మ అష్టకష్టాలూ పడి బి. ఏ. చదివించింది. తీరా- ఆ పిల్ల- రేడియో పిచ్చి బాగా పట్టి ఉద్యోగం చెయ్యనని,

ఆడపిల్లలు ఉద్యోగాలు కెగబడితే మొగాళ్ళకి అసలు దొరకవనీ- తెలివి తక్కువ లెక్చర్లు మొదలుపెట్టింది బి.ఏ. చదివిన ఆ పరమ మూర్ఖురాలు. ఆ అన్నదమ్ములందరికి నచ్చి ఆఖరివాడికి- కట్టబెట్టేరు. చక్రవర్తి- రోజుకో వందసార్లయినా అంటాడు ఆడదంటే- తన ఆఖరి మరదలు మాధవిలా వుండాలని! ప్రతి చెత్తనవలా బట్టీపట్టడం రచయిత్రి తాను ముందే ఊహించి, రాసిందని తెల్సినా- తాను మాత్రమేకనిపెట్టగల్గినట్టు- ఫలానా య్యాక్టరుకి ఫలానా పాత్ర అయితే బాగుంటుందని ఏకరు పెట్టడం ఆమె ప్రత్యేకత అనుకోబడే పిచ్చి. ఈ మాత్రం పనికి బి.ఏ. డిగ్రీ ఎందుకో బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాదు తనకి!

ఆవిడగారు ఆయా నవలా చిత్రాలకోసం పడిగాపులు పడుతుంది. విడుదలైన్నాడే వెళ్ళాలి. లేకపోతే- ''ఎంత పని జరిగింది?'' అంటూ హీరో నాగేశ్వరరావు గారు ఆవేదన పడినట్టు- ఊ- ఇదైపోతుంది. మొన్నటి తద్దినం రోజున- ఆవిడగారు ప్రతిపాదించిన ఆ - మూడు- రేపిస్ట్లు, ఐదు స్టంట్లు, ఆరు త్యాగాల- సుఖాంతం అనబడే వికారాంత చిత్రరాజం తిలకించి తరించక తప్పలేదు. వాళ్లున్న మూడు రోజులూ మొత్తం ఆరేడు వందలు ఖర్చయి వుంటుంది. తగలెయ్యడం అంటే ఏవిటో అప్పుడు గుర్తురాదు. మరి!

''తద్దినం బ్రాహ్మడికి- మొత్తం వంద రూపాయల వరకూ- సమర్పించారు. మరి ఈ పస్తున్న వాళ్ళూ బ్రాహ్మలేగా? పోని ఇచ్చింది బ్రాహ్మలకే గదా- అని తృప్తి పడకూడదూ! బ్రాహ్మడైనా ఎంతో కొంత స్థితిమంతుడవ్వాలి! కనీసం ఏడెనిమిది అంగుళాల ఎత్తున్న పొట్టతో ఆయాసంతో- అప్పనంగా వచ్చిపడేది తిని అరిగించుకోలేని పరాన్న బుక్కు అయి వుండాలి! స్వతంత్రంగా చదువుకొని ఉద్యోగం చేస్తూ- నెల జీతంతో బ్రతికే వాళ్ళకి మాత్రం అవసరానికి రెండు రుపాయలివ్వ కూడదు! అది తగలెయ్యడం. ఇంతకీ ఈ ఏడుపంతా వాళ్ళకిచ్చినందుక్కాదు! తను ఇచ్చినందుకు ఆ బాధ. మరి తను ఎవడి అమ్మమ్మ సొమ్మనో తన చేత అడ్డమైనవాళ్ళకీ చాకిరీ చేయించడం? అడిగే వాళ్ళు లేరుకదా! తన పుట్టింటి వాళ్ళకి అతనే దేవుడు!!!

ఆ మధ్య పెదక్క వచ్చింది. ఈయనగారు రెండు వందలు పెట్టి రెండు చీరలు తెచ్చాడు. ''ఒకటి మీ అక్కకీ, ఒకటి నీకూ!'' అన్నాడు గొప్పగా! ఆవిడగారికి ఏమీ లోటు లేదు అయినా వంద రూపాయల చీర- చెల్లెలి మొగుడు కొనిస్తే మురుస్తూ పెట్టెలో పెట్టుకుంది. వెళ్ళే ముందు ఎదురింటావిడతో చెప్పడానికి వెళ్ళి మరిదిని తెగ పొగిడింది. ''ఈ రోజుల్లో బంధుప్రీతి గలవాళ్లు నూటికే ఒక్కరో వుంటా''రంది. ''అందులో మా చిన్న మరిది ఒక''డంది. ''పుట్టింటి వాళ్ళనీ, అత్తింటి వాళ్ళనీ ఒకేలా ఆదరిస్తా''డంది. ''ఆ మాటకొస్తే మా చెల్లెలే ఇల్లో నారాయణమ్మ!'' అంది. అందరూ తనలాంటి ఆడాళ్ళేననీ- స్వంత చెల్లెలిని తిట్టి. మరిదిని పొడిగితే తనకి గొప్పతనం వస్తుందని- ఆవిడగారి ఆపోహ! ఇలాంటి వేధవలే చుట్టాలంతా అయినప్పుడు ఇల్లో నారాయణమ్మ అయితే వింతేవిటో?- రాజ్యానికి అన్నీ సందేహాలే!

''పైగా ఆ వాగుడు చూడాలి! ఎవరాడుతున్నారు- నాటకాలు? తనా, నేనా?'' ఆలోచనల్లో వేడెక్కిన రాజ్యం బుర్రని చల్లబరచేది చలంగారి పుస్తకాలే! ఉన్నదంతా స్త్రీ శక్తే! స్త్రీ శక్తికి మించినదేదైనా వుంటే దివ్యశక్తే! అటువంటి స్త్రీ ఎప్పుడు ఒకరకం నీచత్వానికి తలఒగ్గవలసిందేనా ఇట్లా?







అని ప్రశ్నిస్తాడు! ''చివరికి తనతో కూడా చనువుగా వుండనియ్యని తన పెనిమిటి...!'' అంటుంది 'మైదానం' లో హీరోయిన్! ఇలాంటి నీచులు పెళ్ళిళ్ళుచేసుకోవడం ఎందుకో మరి. అన్నింటి కంటే గొప్పసత్యం- ఒకటుంది చలంగారు కనిపెట్టింది. ''కొంపకి రాగానే కోటూ, కండువాతో బాటు -మేనర్సు కూడా వంకెకి తగిలించేస్తాట్ట'' మొగాడు! హుఁ! ఆ పుస్తకాలు చదివేదెందరు? ఆడమేళమే-చలాన్ని హేళన చేస్తే మగాడికేం పట్టింది? అందులోను ఇలాంటి మొగాడికి?

తలుపు చప్పుడైతే వెళ్లి తీసింది రాజ్యం. నిన్న రెండు రూపాయలు అడిగిన దొడ్డమ్మగారి మనవరాలు! ''బామ్మ పంపింది అత్తయ్యగారూ! మరేమో మీరు పది రూపాయలిస్తానన్నారట కదూ''? అంటోంది.

''అడిగాను పాపా! మీ మామయ్యగారి దగ్గర కూడా లేవట!''- అంది రాజ్యం! ఈ మాట ఎవ్వరూ నమ్మరు. అసలాయన ఎవ్వరడిగినా 'లేవు' అనరు. మొన్న అసలావిడ వచ్చింది కూడా




అందుకే! అందరి దగ్గర చేదుబళ్ళు చేసేననీ, ఇక అడగడానికి సిగ్గేసిందనీ, చక్రవర్తి గారయితే ఎవ్వరడిగినా సాయం చేస్తారని- కొడుకు అన్నాడనీ చెప్పింది. అడగ్గానే రెండు రూపాయలిచ్చినందుకు దీవించింది కూడా ''ఎంతో పుణ్యం చేసుకుంటేగాని- ఇంత చక్కని జోడు కుదరదమ్మా! పెట్టిపుట్టాలి! వెయ్యి జన్మలకీ- మీరు విడిపోరు తల్లీ!'' అనేసింది, జన్మల మీద నమ్మకం లేకపోబట్టిగాని- లేకపోతే ఆ దీవెనకి అప్పుడే గుండె ఆగి పోవలసిన మాట!''- నీరసంగా నవ్వుకుంది రాజ్యం!

నాల్గు రోజులు ముభావంగా గడిచేయి! క్రితం రాత్రి దిగిన వేలు విడిచిన అప్పగారితో- సరాగాలాడుతున్నట్టు చచ్చు జోకులేస్తూ కబుర్లు చెప్తున్న చక్రవర్తి 'ఇదిగో! మా అక్కకి హార్లిక్సు కలిపేవా?'' అంటూ గట్టిగా కేకేసాడు. మాట్లాడకుండా గబగబా తీసికెళ్ళింది- రాజ్యం! ''ఆయనకేం మారాజు! అమ్మో నువ్వేనా? ఎలాగూ ఓ లక్ష పోగుచేసి వుంటావు!... పోనీ... బయటికి పోవడం దేనికి? నాకేయిచ్చి చేసేయ్! బాగుంటుంది కూడానూ, నీ కూతురు- ఎర్రగా... బుర్రగా!''... చక్రవర్తి!

''ఆ! నువ్వూ మీ మామయ్య ఏవీ ఎరగరు పాపం! (ఆవిడని మేన మామకే కట్టబెట్టేరు)- చూడవే రాజ్యం! మీ ఆయన మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడట!'' రాజ్యం బలవంతంగా నవ్వి గ్లాసు తీసుకుని వెళ్ళి పోయింది.

''దాని మాటకేంగాని- పిల్లాడి విషయం చూడు. మార్కులు మరీ తక్కువంటున్నారు. ఎలాగో నువ్వే చెయ్యాలి! వాణ్ణి ఎలాగో గట్టెక్కించావంటే- ఆడపిల్ల మాటకేంలే!...''

''చెప్పేనుగా నీకెందుకు వాణ్ణి వదిలెయ్ నాదగ్గర. ఈ మధ్య పదిమంది వరకూ ఉద్యోగాలెయ్యించాను. ముగ్గురికి ఐ.టి.ఐ. లో సీట్లిప్పించాను...''

''నాకు తెల్సురా! అందుకే నీ దగ్గరికి రావడం!''

''అయితే కొడుకు కోసం వచ్చావన్నమాట! అభిమానంతో తమ్ముణ్ణి చూడ్డానికొచ్చాడు!'' నిష్ఠూరాలు మధ్యలోనే.

'అభిమానం! అబ్బ! ఎంత చక్కని మాట! అభిమానం!'' వితర్కించుకొంటోంది. వంటింట్లో రాజ్యం!

''చక్రవర్తిగారూ! చక్రవర్తిగారూ!'' హడావిడిగా వచ్చాడు- ఎదురింటి శేషాచారిగారు - ''పాపం సర్వేశ్వరశాస్త్రిగారి తల్లి పోయిందండీ!''

''ఆ!''

''ఆయన -పాపం- కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్నాడండీ! తల్లిని తిండి పెట్టకుండా చంపేనని బావురుమంటున్నాడు. వారం రోజులనుండి వాళ్ళసలు మెతుకు ముట్టలేదట! అప్పులు చేసి, చేసి ముఖం చెల్లక ఆయన అడగడం మానేసేడు. ఆవిడ చేబదుళ్ళుచేసి, చేసి కొడుక్కి, మనవళ్ళకి పెట్టి- ఊరుకునేదేమో! అయినా ఏం మనిషండీ- ఇప్పుడు మళ్ళీ పెళ్ళాం పురుటి మంచం మీద వుంది- ఆపరేషనంటే భయమట! అదేం కాదులెండి మగ పిల్లాడి కోసం!'' ఆచారిగారి సోది అసందర్భంగా వున్నా- 'మగ పిల్లాడి కోసం!' అని తప్పు పట్టేసరికి ఆచారిగారి ధోరణి చికాకెత్తించింది.

'అబ్బ! పోనిద్దురూ! పదండి, వెళ్దాం!'' అన్నాడు.

రాజ్యం కడుపు తరుక్కుపోయింది. పాపం ఆవిడ తిండిలేక- వండుకోడానికి బియ్యం లేక- కొనడానికి డబ్బులేక- దొరికినన్నాళ్ళు వాళ్ళకి పెట్టి తను పస్తులుండి, చచ్చిపోయింది, ఎంత దారుణం! ఒక్కసారి అప్పు పెడితే ఇక అంతే! వడ్డీలకే సరిపోదు, నెలజీతం! జీవితాలు వెళ్ళమారిపోతాయి. మరీ ఇంత అజ్ఞానమా? మగ పిల్లాడికోసం- ఇంతమంది పస్తులుంటూ కూడా? ఛీ! ఛీ! ఇప్పుడేడవడం దేనికి? ఇప్పుడా పురటాల్ని తీసుకొచ్చి, తడి, మడీ అని చంపుతారు- రెండు వారాలు అబ్బ! ఎంత దారుణం! పాపం, ఆ పిల్లలు ముగ్గురూ కడుపునిండా తిని ఎన్నాళ్ళయిందో? ఛార్జీలు పెట్టుకోలేక ఇక్కడే వుంచేసేడట- ఆ పిల్లల్ని!''

మధ్యాహ్నం- ఆడపడుచు ఎదురింటి ఆచారి గారి పెళ్ళాంతో అంటోంది. 'మా వాడెప్పుడూ అంతేనండీ! ఎవరు కష్టాల్లో వున్నా- వాడి మనసూరుకోదు!''

''అవునండీ! అందరూ ఎంతవేస్తే తాను మొత్తం అంత వేస్తారట! మొత్తం కలిపి. ఏ లోటూ లేకుండా అంత్యక్రియలు దగ్గరుండి జరిపిద్దాం అన్నారట! ఈ రోజు సెలవు పెట్టేసేరట కూడా ఆఫీసుకి!''

''చచ్చిన తర్వాత ఎంత డబ్బు! ఎంత హడావిడీ! హు! ఆత్మశాంతి! ఆత్మశాంతి' అంటారు ఆని... ఆ ఆత్మలే బ్రతికి వుంటే ఈ నీచత్వాన్ని ఎలా క్షమిస్తాయ్?'' రాజ్యం- ఊహలని!